


# స్వధర్మం

డా॥ ఆర్వీయస్. సుందరం

నెల్లూరునుంచి కృష్ణమూర్తి వచ్చాడు. మా యిద్దరిదీ పాతికేళ్ళపైబడ్డ స్నేహం. తిరుపతిలో ఇద్దరం ఎం.ఏ. చదివాం. తర్వాత అతను కాలేజీ లెక్చరరుగా ఊళ్లో తిరుగుతున్నాడు. నేను తిరుపతిలోని విశ్వవిద్యాలయంలో చేరి స్థిరపడ్డాను. మెల్లగా వచ్చిన పని బయటపెట్టాడు కృష్ణమూర్తి.

"మా అమ్మాయికి పెళ్ళి ఈడు వచ్చిందయ్యా. మనిద్దరం బంధువులమయితే ఎలా ఉంటుంది.?"

"బాగానే ఉంటుంది. కాని పిల్లలు మనమాట వినాలి కదా! ప్రస్తుతానికి మా యిద్దరు అబ్బాయిలూ పెళ్లిచేసుకునే స్థితిలో లేరు. ఇంతకీ ఎవరికివ్వాలని నీ ఉద్దేశం?" అని కుతూహలంతో అడిగాను నేను.

"చిన్నవాడు ప్రజ్వల్‌కి."

"ఇది మరీ బాగుందోయ్! పెద్దవాణ్ణి అలాగే ఉంచేసి చిన్నవాడికి పెళ్ళి చెయ్యమన్నావా? అదెలా కుదురుతుంది?"

"అమ్మాయికి ప్రజ్వల్‌ని చేసుకోవాలని ఉంది విశ్వం. ఇద్దరికి ఈడూ జోడూ బాగుంటుంది" కృష్ణమూర్తి మాటలు విని నేను ఆలోచనలో పడ్డాను.

నిజమే...మామూలుగా ఎవరైనా ప్రజ్వల్‌నే ఇష్టపడతారు. మా పెద్దవాడు ప్రశాంత్. ఇంజనీరింగ్ చివరి రెండు సెమిస్టర్లూ తప్పాడు. ఎంతో కష్టంతో బెంగుళూరులో డొనేషన్ కట్టి చేర్చాను. అయినా చదువు సరిగ్గా అబ్బలేదు. వాడు చామన చాయ. ఏం పెద్ద చెప్పుకోదగ్గ అందమూ కాదు. వాడికి ఇరవై అయిదేళ్ళు వచ్చాయి. కోర్సు పూర్తి కాగానే పెళ్ళి చేయాలి. రెండోవాడు ప్రజ్వల్ ముఖంలో మంచి కళ ఉంది. వాడూ ఇంజనీరింగ్ చివరి ఏడాది తిరుపతిలోనే చదువుతున్నాడు. కొంత సంగీతం మీద అభిమానమూ ఉంది. వాడికీ ఇరవై మూడేళ్ళు వచ్చాయి. ఇద్దరు కొడుకుల్ని ఇంజనీరింగ్ చదివించటమంటే మాటలా? మధ్యతరగతి కుటుంబాన్ని ఎలాగో ఈడ్చుకొస్తున్నాను నేను. ప్రజ్వల్‌కి అప్పుడే రెండు మూడు పెళ్లి సంబంధాలు వచ్చాయి. కాని నేనే పడగొట్టేశాను.

"ఏమిటయ్యా ఆలోచనలో మునిగిపోయావు! ఇంతకీ నా కూతుర్ని చేసుకుంటావా, చేసుకోవా,

అదయినా చెప్పు. నేను మాత్రం ఈ ఏడాదే పెళ్ళి చేసెయ్యాలనుకుంటున్నాను."

"లేదయ్యా... ప్రస్తుతానికి పెళ్ళి ఆలోచన లేదు. వాడి మనసు కొంత కుదుట పడాలి."

"అదేమిటి మళ్ళీ మధ్యలో"

"కృష్ణా! నీకో కథ చెప్తాను విను."

"భలేవాడివే... నేనేదో అడగటానికి వస్తే నన్ను కూచోబెట్టి కథలు చెప్తావా" ప్రశ్నార్థకంగా ముఖం పెట్టాడు కృష్ణమూర్తి. నేను చెప్పసాగాను.

* * *

ఒకరోజు నేను, మా ఆవిడ కృష్ణాఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ బయల్దేరాం. మాకు చాలా ఆత్మీయులైన స్నేహితుల పెళ్ళి పిలుపు వచ్చింది. వాళ్ళు చాలాకాలం తిరుపతిలో మా యింటిపక్కనే కాపురం ఉండేవారు. తర్వాత బదిలీ అయి విజయవాడ వెళ్లారు. అయినా మా మధ్య అనుబంధం తెగిపోలేదు. కామేశ్వరరావు, ఆయన భార్య ఒక్కగానొక్క అమ్మాయికి పెళ్లి. మూడురోజుల ముందే పెళ్లికి బయలుదేరాం.

ఆరోజు కృష్ణాఎక్స్‌ప్రెస్ చాలా రద్దీగా ఉంది.ఒక అరగంట ముందే వెళ్లాం కాబట్టి సీటు దొరికింది. కాని చాలామంది నిలబడే ఉన్నారు.

నెల్లూరులో మా పక్కన కూచున్న మనిషి దిగగానే ఒక అమ్మాయి కార్నర్ సీటులో పుస్తకం విసిరేసి వెంటనే వచ్చి కూచింది. నేను మధ్యలో కూర్చుని ఉన్నాను. మా ఆవిడని మధ్య సీటుకి రమ్మన్నాను.

"పరవాలేదు లెండి... చిన్నపిల్ల. మీ పక్కన కూర్చుంటే ఏమీ అయిపోదు." అందావిడ.

నేనూ ఊరికే కూర్చుండిపోయాను.

నా పక్కన కూర్చున్న అమ్మాయివైపు చూశాను. బహుశా ఇరవైయేళ్ళు ఉంటాయి. చామనచాయ, పెద్దపెద్ద కళ్లు, బొద్దుగా, అందంగా ఉంది అమ్మాయి. బాగా చలాకీగా ఉండే అమ్మాయిలా అనిపిస్తోంది. కాని ఎక్కడో ఏదో లోపం ఉంది. ముఖం అంత ప్రసన్నంగా ఉంది. ఎందుకో బాధ పడుతోంది.

"సీటు దొరికిందిగా. ఇంకా ఎందుకు కంగారు పడుతున్నావ్" అన్నాను మాటలు కల్పించుకొని.

"ఏంలేదండి" ముక్తసరిగా జవాబిచ్చింది.

"నెల్లూరులోనే ఎక్కావా?"

"లేదండి.. తిరుపతిలోనే ఎక్కాను. కాని సీటు దొరకలేదు. ఇప్పుడే దొరికింది" ఇక మాటలు కొనసాగించటం ఇష్టంలేదన్నట్లు కిటికీలోంచి చూడ

**జన్మదిన కథల పోటీలో బహుమతులు గెలుచుకున్న కథల ప్రచురణ ముగిసింది. ఈ వారం నుండి ఆ పోటీకి వచ్చిన కథలలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన వాటిని అచ్చువేయడం మొదలుపెడుతున్నాము. వాటిలో మొదటిదే ఈ కథ. ఆగస్టు 10-16 సంచికలో ఇచ్చిన జాబితాలోని 45 కథలను కనీసం వారాని కొక్క కథ, వీలయితే రెండు చొప్పున ప్రచురించాలని మా ఆశ!**

సాగింది.

నేనూ ఊరుకుండి పోయాను. నా చేతిలో పుస్తకం ఉంది. ఎప్పటిలాగే రైల్లో పఠనం కొనసాగించాను.

కాస్సేపటికి పక్కసీటు అమ్మాయి వెక్కుతున్నట్లు అనిపించింది. గాభరాగా అటువైపు చూశాను. కిటికీలో తలపెట్టుకొని ముఖాన్ని చేతులకింద దాచి ఉంది ఆ అమ్మాయి. ఏడుస్తోందో, నిద్రపోతోందో, కలవరిస్తోందో తెలియలేదు.

"అమ్మాయ్. ఇటు చూడు" పిలిచాను.

ఏం కదలిక లేదు.

మరోసారి పిలిచాను.

తల ఎత్తి నా నావైపు చూసింది. కళ్లనిండా నీళ్ళు!

ఎందుకమ్మా" ఓదారుస్తున్నట్లుగా అడిగాను.

"ఏం లేదండి".

"కన్నీళ్లు పెట్టుకుంటూ ఏంలేదంటే నమ్ముతానా. ఏమిటో చెప్పు. నేనేమైనా పరిష్కరించగలిగితే పరిష్కరిస్తాను."

"ఏంలేదండీ."

ఆ అమ్మాయికి కారణం చెప్పటం ఇష్టంలేదని స్పష్టమయింది.

వాటర్ బాటిల్ చేతికందించాను. "ముందు నీళ్ళు తాగు. కళ్ళు తుడుచుకో" అన్నాను.

మారు మాట్లాడకుండా మంచినీళ్లు తాగింది.

"ఎక్కడికి వెళ్లాలి?"

"విజయవాడ."

"మేమూ విజయవాడే."

మామధ్య మళ్ళీ మౌనం తాండవమాడింది.

"తిరుపతిలో ఏం చేస్తున్నావ్?"

"ఇంజనీరింగ్ డిప్లొమా చేస్తున్నాను."

"విజయవాడలోనే చేయకపోయావా?"

"తిరుపతిలో మాఅక్క ఉంది. మా బావ ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరరుగా ఉన్నారు."

"అరె... బాగుందే. మా అబ్బాయి కూడా ఇంజనీరింగ్ చదువుతున్నాడు."

కాసేపటికి ఆ అమ్మాయి తన దుఃఖపు ఆలోచనలనుంచి తేరుకున్నట్లుంది. ముఖం బాగా తేటపడింది. ముద్దుగా ఉంది అమ్మాయి. ఈ లేత వయసులో .ఏమిటో ఆ అమ్మాయికి కష్టాలు!

కృష్ణాఎక్స్‌ప్రెస్ ఒంగోలు చేరుకునేసరికి కడుపులో ఆత్మారాముడు గోల చేయనారంభించాడు. రైలు దిగి త్వరత్వరగా వెళ్ళి ఇడ్లీ, గారెలు మూడు ప్లేట్లు పట్టుకొచ్చాను. మా ఆవిడ చేతిలో ఒకటి పెట్టి, మరొకటి ఆ అమ్మాయికి ఇచ్చాను. ఒక పట్టాన పుచ్చుకోలేదు. బలవంతాన చేతిలో పెట్టి తినమన్నాను. విధిలేక తిన్నది.

మరి కాసేపటికి అవిషయం, ఈ విషయం మాటలు కలిపి చనువుగా మాట్లాడసాగింది ఆ అమ్మాయి. ఆ అమ్మాయి పేరు రమ్య. వాళ్ల నాన్నగారు జేమ్స్ .విజయవాడలో బట్టల వ్యాపారి. రమ్య, సౌజన్య ఆయన కుమార్తెలు. సౌజన్య పెళ్లి చేసుకొని తిరుపతిలో ఉంది. రమ్య సెలవుల్లో అక్కయ్య వాళ్లింటినుంచి విజయవాడకు బయలు దేరింది.

రమ్య నాచేతిలో పుస్తకం చూసింది.

"తీసుకో. చూడు" అని ఇచ్చాను.

'శేషేంద్ర చమత్కారికలు ' పుస్తకం చదువుతూ కూర్చుంది రమ్య. నేను మరో పుస్తకం తీసుకొని చదవనారంభించాను.

అరగంట తర్వాత పుస్తకంలోంచి వెలికి వచ్చింది రమ్య.

"ఏమిటమ్మా, అంతగా పుస్తకంలో మునిగి .పోయావ్? ఆయన కంటే పనిలేదు. పుస్తకాలు తప్ప

మరో ధ్యాసలేదు. మనుషులు పక్కన కూర్చున్నా పుస్తకాలలోనే ఎపుడూ మునిగితేలుతుంటారు. నువ్వయినా సరదాగా మాట్లాడకుండా ఇలా పుస్తకాలు చదువుతూ కూర్చుంటావెందుకు" ధారాప్రవాహంగా సాగింది మా ఆవిడ వాగ్ధాటి.

"పుస్తకం బాగుంది ఆంటీ. ఈ కవితలు ఒక్కొక్కటీ చదువుతుంటే ఎంత ఖుషీగా ఉంది! సమాజాన్ని గూర్చి కవి అభిప్రాయాలు చదువుతుంటే ఎన్ని విషయాలు తెలుస్తాయి. అయితే కవులు రాసిందానివల్ల సమాజం మారుతుందంటారా?"

"అవన్నీ నాకు తెలీదమ్మా. ఆయన్ని అడుగు" అంది మా ఆవిడ.

మరో గంటసేపు ఎన్నెన్నో విషయాలు మా మధ్య సంభాషణలో దొర్లాయి. సమాజం, సమాజ విద్రోహక శక్తులు, ఎన్నికలు, రాజకీయ నాయకులు, కవిత్వం, సమాజం మీద దాని ప్రభావంలాంటి విషయాలన్నీ చర్చించుకుంటూ కూర్చున్నాం.

రమ్య మాటల్లో అమాయకత్వం, కుతూహలం, సామాజిక అవగాహన నాకు బాగా నచ్చాయి. "అమ్మాయి చాలా తెలివైంది. అవగాహన కలది. బాగా పైకొస్తుంది." అనుకున్నాను.

మాటల మధ్యలో మళ్లీ అడిగాను. "నీవు ఎందుకు కన్నీళ్లు పెట్టుకున్నావు" అని.

మళ్లీ రమ్య ముఖంలో విషాదపు నీలి నీడలు నర్తించసాగాయి.

"నిన్ను కష్టపెడుతున్నాను అనుకునేట్లయితే చెప్పవద్దు. చెప్పాలి అనిపిస్తేనే చెప్పు" అన్నాను.

"మీరు దాన్ని పరిష్కరించలేరు అంకుల్" అంది.

"ఏమో పరిష్కరించే అవకాశం ఉందేమో"అన్నాను నేను.

"తిరుపతిలో ఒక అబ్బాయితో బాగా పరిచయం అయింది. అతను మా బావగారి దగ్గరికి వస్తూ ఉంటాడు. నాతో చనువుగా మాట్లాడతాడు. పదిరోజుల క్రితం మా నాన్నగారు వచ్చినపుడు మేమిద్దరం మాట్లాడుతుంటే చూశారు. బాగా చీవాట్లు పెట్టారు."

"నీకు ఆ అబ్బాయి అంటే చాలా ఇష్టమా? నువ్వంటే ఆ అబ్బాయికీ చాలా ఇష్టమా?"

"నాకెందుకో అతనిమీద చాలా ఇష్టంగాఉంది. చాలా బుద్ధిమంతుడు. మా నాన్నగారు అడిగితే చెప్పాను కూడా అతన్నే పెళ్లి చేసుకుంటానని. 'నీ మొహం' అనేశారు. నిన్న కూడా ఆ అబ్బాయి మా అక్కయ్య వాళ్లింటికి వచ్చాడు.'ఈసారి ఏదో ఒకటి తేల్చుకురా. నేనూ మా పెద్దవాళ్లతో చెప్తాను' అన్నాడతను. మా నాన్నగారు ఏమంటారో అని భయంగా ఉంది" అంది రమ్య.

"ఇలాంటి విషయాల్లో చాలా జాగ్రత్తగా ఉండాలమ్మా. ప్రతి అడుగూ తూచినట్లు వెయ్యాలి" అన్నాను. అంతకంటే ఏంచెప్పాలో నాకు తోచలేదు.

విజయవాడకు వెళ్లే లోపల రమ్య చాలా దగ్గరి సంబంధం ఉన్నదానిలా అయింది. మాతో కలిసి ప్రయాణం చేసింది కొన్ని గంటలే అయినా, కొన్ని సంవత్సరాలఅనుబంధం కలిగినట్లు ప్రవర్తించింది.

"విజయవాడలో మా ఇల్లు స్టేషను దగ్గరే. మా ఇంటికి రండి అంకుల్! ఈ రోజు ఉండి రేపు మీ స్నేహితుల ఇంటికి వెళ్ల వచ్చు" అంది రమ్య.

"లేదులేమ్మా... మా స్నేహితుడు ఎదురు చూస్తుంటాడు. కాని విజయవాడ వదిలి వెళ్లే లోపల తప్పకుండా మీ ఇంటికి వస్తాం" అన్నాను.

నాకేమో లోలోపల వెళ్లాలనే ఉంది. రమ్య వ్యక్తిత్వం అంతగా నన్ను ఆకర్షించింది. అదీగాక ఇంత ముందుగా వెళ్లి చేసేదీ ఏంలేదు. పెళ్లి ఇంట్లో హడావిడిగా ఉంటుంది. హోటల్లో రూం తీసుకుంటే బోలెడంత ఖర్చు. మధ్యతరగతి మనస్సు ఒకరోజైనా డబ్బు ఆదా చెయ్యమని ప్రోత్సహించింది.

రమ్య పట్టిన పట్టు వదలలేదు. "మీరు ఈ రోజు మా యింట్లోనే ఉండాలి అంకుల్. మాది పెద్ద ఇల్లు. ఇంట్లో మరెవ్వరూ లేరు. అమ్మ, నాన్న అంతే. నాకు ప్రత్యేకంగా గది ఉంది. అక్కడే మీరు ఉండవచ్చు. మేము వేరే మతం వారమని మీకేమైనా అభ్యంతరమా?" అంది.

"ఛీఛీ... అలాంటి ఆలోచన మాకు ఏ కోశానా లేదు.

"ఎంతవరకంటే మేం మాంసాహారం మాత్రం ముట్టం. అంతేగాని మాకు ఏవిధమైన పట్టింపులూ లేవు" అన్నాను.

చివరికి రమ్య తన పట్టు నెగ్గించుకుంది. మేం నేరుగా వాళ్లింటికే వెళ్లాం. రమ్య తల్లి దండ్రులు మమ్మల్ని చాలా ఆప్యాయంగా పలకరించారు. ఆరోజు అక్కడే ఉండి పొమ్మని బలవంత పెట్టారు.

రమ్య గదిలోనే మాకు బస ఏర్పాటు చేశారు.

వాళ్లింటికి వెళ్ళిన గంటలోపే మాకు పెద్ద షాక్ ఎదురయింది.

రమ్య టేబుల్ మీద పెటిన కాగితాలు ఫ్యాను గాలికి ఎగిరిపోయి వాటిలోంచి ఫోటో ఒకటి బయటపడింది. అది ఎవరిదో కాదు, మా ప్రజ్వల్‌దే!

నేను షాక్‌నుంచి త్వరగానే తేరుకున్నానుగాని మాఆవిడకుమాత్రం చాలా సేపే పట్టింది.

"ఏమిటండీ ఇది" అంటుంది కాని ఆవిడ నోటినుంచి మాటే రావటం లేదు.

రమ్య రాగానే అడిగాను. "నువ్వు చెప్పిన అబ్బాయి ఇతనేనా" అని.

"అవును మామయ్యా" అంది.

నాకు వెంటనే ఏం చెప్పాలో పాలు పోలేదు. రాత్రి భోజనాల సమయంలో మెల్లగా ప్రస్తావన తెచ్చాను.

"మీరు తిరుపతి వచ్చినప్పుడు ఒక అబ్బాయిని చూశారు కదూ" జేమ్స్‌గారిని అడిగాను.

"అవును"

"ఆ అబ్బాయి మా అబ్బాయే!"

"అలాగా" ఆశ్చర్యంగా అన్నారాయన.

రమ్య ముఖంలో వెయ్యి ఓల్టుల బల్బు వెలిగినట్లయింది. సంతోషంతో ఎగిరిగంతులేద్దామా అన్నట్లుచూసింది.

"మీ అమ్మాయిని మా అబ్బాయికి చేసుకోడానికి మాకేమీ అభ్యంతరమూ లేదు. అయితే వాడి చదువు పూర్తి అవాలి. మా పెద్ద వాడికి పెళ్లికావాలి."

## ఎక్స్-రే

'చో' రామస్వామి బహుముఖ ప్రజ్ఞాశాలి. నటుడుగా, న్యాయవాదిగా, రచయితగా, పత్రికా సంపాదకుడుగా అనేక రంగాలలో రాణిస్తున్న 'చో' సంపాదకత్వంలో వెలువడే 'తుగ్లక్' ఘాటైన వ్యంగ్య విమర్శలకు పెట్టింది పేరు. కాశ్మీర్ నయినా, కరుణానిధి నయినా 'చో' విడిచిపెట్టడు.

అయితే దేశం ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటో 'చో' స్పష్టంగా పేర్కొన్నా వాటికి పరిష్కారాలు మటుకు ఎప్పుడూ సూచించలేదు.

''సమస్యలను స్పష్టంగా పేర్కొన్నా పరిష్కారాలు ఎందుకు సూచించలేదు?'' అని ఎవరయినా 'చో'ను అడిగితే - ''రోగం నివారించలేదని ఎవరయినా ఎక్స్-రేని నిందిస్తారా? రోగం ఏమిటో నిర్ధారించే పనే ఎక్స్-రేది. అసలు కంటికి కనిపించని రోగం ఏమిటో తెలుసుకోవాలంటే ఎక్స్-రే తీయాలి. ఆ తర్వాత పని స్పెషలిస్టుది. అలాగే నేను విమర్శకుడిగా ప్రధాన సమస్యలను నలుగురి దృష్టికీ తెస్తున్నాను. రాజకీయాలలోనూ, పరిపాలనా రంగంలోనూ ఉన్న స్పెషలిస్టులు వాటిని పరిష్కరించాలి. నా పని నేను చేస్తున్నాను. వారి పని వారు చేయడంలేదు. అంతే'' అంటారు 'చో'.

సేకరణ: **తాజీ ప్రసాద్**
[మద్రాసు]

"మా అమ్మాయిని మీ అబ్బాయికి ఇవ్వడానికి నాకూ ఏం అభ్యంతరం లేదు. అయితే మీ అబ్బాయి మతం మార్చుకోవాలి"జేమ్స్‌గారన్నారు.

నాముఖం పాలిపోయింది. 'ఇక ఈ పెళ్లి జరగదు' అన్నట్లు ముఖం గంటుపెట్టుకున్నాను. మా ఆవిడ కూడా నోట్లో అన్నం పెట్టుకోబోతూ ఆపేసింది.

"అదెలా కుదురుతుంది? అమ్మాయి మా యింటికి కదా వస్తుంది. నాకు ఏ వివాహ విధులమీదా నమ్మకం లేదు. రిజిస్టర్‌మారేజి చేసుకోనివ్వండి. ఎక్కడైనా హాయిగా ఉండనివ్వండి. వాళ్ల ఆనందానికి మతాలు ఎందుకు అడ్డురావాలి" అన్నాను నేను.

"అలా కాదు పెళ్లి మా సంప్రదాయం ప్రకారమే జరగాలి" అన్నారు జేమ్స్‌గారు.

నేను చెయ్యి కడిగేసుకున్నాను. మా ఆవిడా అంతే. రమ్య చిన్న బుచ్చుకుంది.

"మా నాన్న చాలా పట్టుదల మనిషి అంకుల్. మీరే సర్దుకుపోవాలి" అంది.

"నీ అభిప్రాయం ఏమిటమ్మా" అన్నాను.

"నాకెలా అయినా పరవాలేదు అంకుల్. కాని మా నాన్నగారిని ఎదిరించలేను" అంది.

"మావాడూ అంతేనమ్మా" అన్నాను.

తర్వాత నేను సంభాషణ పొడిగించలేదు. తిరుపతికి రాగానే ప్రజ్వల్‌ని అడిగాను."ఏమిట్రా సంగతి" అని. "నాకు ఇష్టమే నాన్నా. కాని మీకు ఇష్టం లేకపోతే చేసుకోను" అన్నాడు.

"నాన్నా! నామాట జాగ్రత్తగా విను. ముందు నీ చదువు పూర్తికావాలి. నీకు ఉద్యోగం రావాలి. మీ అన్నయ్యకు పెళ్లి కావాలి. అన్నయ్య పెళ్లి కాకున్నా పరవాలేదు. కాని నీవు మాత్రం మతం మార్చుకోటానికి వీలులేదు. మతాతీతమైన మనస్తత్వం నాది. నీవూ అలాగే ఉండాలని నేననటంలేదు. ప్రేమకు మతం అడ్డువస్తే మతాన్ని వదిలెయ్‌కాని మరో మతాన్ని పుచ్చుకోవలసిన అవసరం లేదు. ప్రేమ మీద నమ్మకమన్నది ఇద్దరికీ ఉండాలి. మతం మార్చుకోవటమే ప్రేమకు షరతు అయ్యేట్లయితే స్వధర్మమే శ్రేష్ఠమని ప్రేమకు దూరం కావటం మేలు. ఇది నా దృఢమైన అభిప్రాయం. తర్వాత నీ యిష్టం" అన్నాను నేను.


"మీ ఇష్టమే నాఇష్టం" అన్నాడు ప్రజ్వల్.

* * *

"ఇదీ కథ" అన్నాను నేను.

"నువ్వు చెప్పిందీ నిజమే విశ్వం! అబ్బాయి మనసు కుదుటపడనీ. పెళ్లి విషయం తర్వాత ఆలోచిద్దాం" అన్నాడు కృష్ణమూర్తి.

నా మనసుకూ హాయనిపించింది. ●



### ప్రతీకారం

గొప్ప డాన్సర్‌గా, ఎంతో పేరూ, డబ్బు గడించిన అందాల హీరోయిన్ ఓ దర్శకుడిని పెళ్లి చేసుకుంది. పరిశ్రమలోని వారూ, బయటవారూ అంతా ఆశ్చర్యపోయారు.

చివరికి పాత్రికేయుడు ఉండబట్టలేక ఆమెను ఇంటర్వ్యూ చేస్తూ ఆ దర్శకుడినే పెళ్లాడిన కారణమేమిటో చెప్పవలసిందేనని పట్టుబట్టారు.

"ప్రతీకారం! ఇన్నాళ్లూ నన్ను తన డైరెక్షన్‌లో ఎలా ఆడించాడో ఎన్ని గంతులు వేయించాడో మీకు తెలును గదా!ఇప్పుడిక ఆ అవకాశం నాదిగా చేశాను." అందామె ధీమాగా.

కొప్పుల రవికుమార్ [మండపేట]



## కోర్టు కెక్కిన కోమలి 'వర్ష'

'స్టార్‌డస్ట్' సినిమా తారల సెమీ న్యూడ్ ఫోటోలతో దేశంలో సంచలనం తెస్తోంది. 'నా ఒళ్లు - నా యిష్టం' అనుకునే తారలు వాళ్ల అందాలన్నిటినీ ఆరవిడిచి చూపుతున్నారు ఆ పత్రికలో. పైగా ముఖపత్ర సుందరిగా నగ్నంగానో, అర్థనగ్నంగానో పోజులిచ్చే 'తారామణులు' ఇది తమ సినీ జీవితానికి పెద్ద పీట వేస్తోందని తలుస్తారు. అదిగో, అలాంటి స్థితే 'వర్ష' కెదురైందిప్పుడు. ఆమె సెక్సీ ఫోటో స్టార్‌డస్ట్ కవర్ పేజీ మీద సాక్షాత్కరించింది. అయినింటి ఆడవాళ్లంతా సిగ్గుపడి 'ఛీ' అనుకున్నారు. మహిళా మండలి వారు మండిపడ్డారు. 'అసభ్యకరం-అభ్యంతరకరం ఈ పోజు'ని ఇండియన్ పీనల్ కోడ్ ననుసరించి కేసు బనాయించారు. [ఇండీసెంట్ రిప్రజెంటేషన్ ఆఫ్ వుమెన్ [ప్రొహిబిషన్] యాక్ట్ 1986 - సెక్షన్ 292].

ఇది ఒక పక్క కోర్టులో ఉండగానే వర్ష 'ఫిలిమ్ సిటీ' పత్రికకు ఓ ఇంటర్వ్యూ ఇచ్చింది. తన అందమైన అవయవ సోయగాలు చూడలేని ఈర్ష్యతో ఈ కేసు బనాయించారని ఆడిపోసుకుంది. జూలైలో అది ప్రచురించిం దా పత్రిక. 44వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ [అంధేరి] కేసు విచారిస్తుండగా ఈ ఇంటర్వ్యూ రావడం కోర్టు ధిక్కరణ క్రిందకు వస్తుంది. అది మరొక పెద్ద నేరం. అందుకే 'వర్ష' ఆగస్టు 9న కోర్టుకు హాజరై క్షమాపణ కోరుకుంది. తప్పయిందని, తను జూడీషియల్ సిస్టమ్‌ను దూషించడం దోషమేనని, క్షమించమని అంధేరీ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ వారిని ప్రార్థించింది. నోటి దురుసుకూడదనేది ఆమె తెలుసుకోగలిగిం దిప్పుడు।

తారకం